ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ 'స్పందన' రద్దు

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, ఈ నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు స్పందన కార్యక్రమం ఉండదని పేర్కొన్నారు. తదుపరి ఎప్పుడు నిర్వహించేది ముందుగా తెలియజేస్తామని జిల్లా ప్రజలు పేర్కొన్నారు.

పోలవరం.. ఎవరి పరం..!

వైసిపి అభ్యర్థి ఎస్‌టి కాదంటూ అధికారులకు ఫిర్యాదులు

మళ్లీ తెల్లం బాలరాజే బరిలోకి దిగుతారని ప్రచారం

నిర్వాసితుల వద్దకు వెళ్లేందుకు ఎంఎల్‌ఎ బాలరాజు వెనుకంజ అంటూ చర్చ

జనసేనకు సీటు ఇవ్వడంపై టిడిపి నేతల్లో ఆగ్రహం

జనసేన అభ్యర్థిపైనా రకరకాల ఊహాగానాలు

ఏ పార్టీ అధికారంలో ఉన్నా నిర్వాసితులకు అన్యాయమేనా..?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా మారింది. ఇటు అధికార వైసిపి, ఇటు ప్రతిపక్ష టిడిపి, జనసేనలో అదే పరిస్థితి నెలకొంది. వైసిపి అభ్యర్థిగా ప్రస్తుత ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు సతీమణి తెల్లం రాజ్యలక్ష్మిని అధిష్టానం ప్రకటించింది. తెల్లం బాలరాజుపై వ్యతిరేకత ఉండటంతో ఈసారి ఆయన భార్యకు టిక్కెట్ ఇచ్చినట్లు చర్చ నడుస్తోంది. అయితే వైసిపి అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి ఎస్‌టి కాదని జిల్లా కలెక్టర్ వరకూ ఫిర్యాదులు అందాయి. తెల్లం రాజ్యలక్ష్మి తల్లి భీమమ్మ ఎస్‌టి అని, ఆమె తెలిదిబిజ సామాజిక తరగతికి చెందిన కుక్కల సుబ్బారావును వివాహమాడిన తర్వాత తొలి సంతానంగా రాజ్యలక్ష్మి పుట్టిందని ఫిర్యాదులో ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు మడకం వెంకటేశ్వరరావు పేర్కొన్నట్లు పరిస్థితి నెలకొంది. దీంతో అధికారులు రాజ్యలక్ష్మి సామాజిక తరగతి నిర్ధారణకు విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. తెల్లం రాజ్యలక్ష్మి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా నామినేషన్ వేసిన తర్వాత పరిశీలనలో ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. దీంతో రాజ్యలక్ష్మితోపాటు డెండ్ నామినేషన్‌గా తెల్లం బాలరాజు వేస్తారని, చివరికి బాలరాజే వైసిపి అభ్యర్థిగా ఉంటారనే చర్చ నడుస్తోంది. తెల్లం బాలరాజుపై వ్యతిరేకత ఉండటం కారణంతో టిక్కెట్ ఆయన భార్యకు మార్పు చేశారని, ఆయనే బరిలో ఉంటే పరిస్థితి ఏమిటనే చర్చ వైసిపిలోనూ సాగుతోంది. గత ఎన్నికల్లో పోలవరం నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ కింద రూ.10 లక్షలు, 2006కు ముందు సేకరించిన భూములకు ఎకరాకు రూ.ఐదు లక్షలతోపాటు, భూమికి భూమి, 18 ఏళ్ళ నిండిన యువతకు పరిహారం ఇస్తామంటూ వైసిపి హామీ ఇచ్చింది. ఐదేళ్ల కాలం కరిగిపోయినా నిర్వాసితులకిచ్చిన హామీ నెరవేర్చలేదు. నిర్వాసితులకు పరిహారం అటుంచి ఖాళీ చేయించకుండా పోలవరం ప్రాజెక్టు కాపర్ డ్యామ్ పూర్తి చేశారు. దీంతో ప్రతియేటా జులై, ఆగస్టు నెల్లో విరుచుకుపడుతున్న గోదావరి వరదలకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఉన్న 107 గ్రామాలకు చెందిన 20 వేలకుపైగా నిర్వాసిత కుటుంబాలు ముంపుబారిన పడుతున్నాయి. నెలలు తరబడి కొండలు, గుట్టలపై బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. పరిహారం ఇస్తే తాము వెళ్లిపోతామంటూ నిర్వాసితులు నెత్తినోరు మొత్తుకున్నా వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదు. తమ తరుపున మాట్లాడటంలో ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు విఫలమయ్యారనే ఆగ్రహం నిర్వాసితుల్లో నెలకొంది. ఈ కారణంగానే ఈసారి టిక్కెట్ బాలరాజు భార్యకు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఇటీవల కుక్కునూరులో జరిగిన ఆసరా చెక్కుల పంపిణీకి సైతం తెల్లం బాలరాజు వెళ్లకుండా భార్య రాజ్యలక్ష్మిని పంపించారు. అక్కడకు వెళ్తే నిర్వాసితులు నిలదీసే అవకాశం ఉందని తెలిసి వెళ్లలేదని చెబుతున్నారు. ఆ ప్రాంతంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు బాలరాజు దూరంగా ఉండటంకు ప్రయత్నిస్తున్నారనే చర్చ నడుస్తోంది. ఈ తరుణంలో తెల్లం రాజ్యలక్ష్మి నామినేషన్ తిరస్కరణకు గురైతే పరిస్థితి ఏమిటనే చర్చ నియోజకవర్గంలో నడుస్తోంది.

టిడిపి రచ్చ.. జనసేనలో అభ్యర్థి టెన్షన్

పోలవరం టిక్కెట్ జనసేనకు కేటాయించినట్లు స్పష్టత రావడంతో స్థానిక టిడిపి నాయకుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. బొరగం శ్రీనివాస్‌కు టిక్కెట్ ఇస్తేనే పని చేస్తామని, లేకపోతే పని చేయబోమంటూ ఇప్పటికీ టిడిపి నాయకులు చెబుతూనే ఉన్నారు. దీంతో ఎన్నికల్లో టిడిపి, జనసేన మధ్య సమన్వయం ఎలా ఉంటుందనే చర్చ నడుస్తోంది. మరోపక్క పోలవరంలో జనసేన అభ్యర్థి ఎవరనే దానిపై ఆ పార్టీలో టెన్షన్ నెలకొంది. ఇప్పటి వరకూ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న చిర్రి బాలరాజుకు టిక్కెట్ వస్తుందో, లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఈయన ఆర్థికంగా బలంగా లేకపోవడం కారణమని చెబుతున్నారు. ఇటీవల టిడిపి మొడియం సూర్యచంద్రరావు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆతనికి టిక్కెట్ ఇస్తే జనసేనలో చీలికలు వచ్చే ప్రమాదం ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో పోలవరం టిక్కెట్‌పై టిడిపి, జనసేనలో తీవ్ర కుమ్ములాటలు జరుగుతున్నాయి. జనసేన అభ్యర్థిని ప్రకటించిన తర్వాత మరోసారి కుమ్ములాటలు, ఆందోళనలు జరిగే పరిస్థితి స్పష్టంగా కన్పిస్తోంది.

ఏ ప్రభుత్వమొచ్చినా నిర్వాసితులకు అన్యాయమే..?

గతంలో టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం సైతం పోలవరం నిర్వాసితులకు అన్యాయం చేసిన పరిస్థితి ఉంది. నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా ప్రాజెక్టులో భాగంగా ఉన్న కాపర్ డ్యామ్‌ను పూర్తి చేసి నిర్వాసితులను ముంచేస్తున్న పరిస్థితిని చూస్తున్నాం. గత ఎన్నికల్లో నిర్వాసితుల ప్రత్యేకంగా హామీలిచ్చినా వైసిపి అమలు చేయలేదు. నిర్వాసితుల పట్ల టిడిపి, వైసిపి ప్రభుత్వాలు సైతం తీవ్ర అన్యాయం చేశాయి. పోలవరం కేంద్ర ప్రాజెక్టు. నిర్వాసితులకు పరిహారం సొమ్ములు ఇవ్వాల్సిన బాధ్యత బిజెపిపై ఉంది. అయితే మోడీ సర్కార్ పట్టించుకోలేదు. పోలవరం నిర్వాసితులకు అన్యాయం చేసిన ఈ పార్టీలు మళ్లీ ఓటు కోసం నిర్వాసితుల వద్దకు వెళ్తుండటం గమనార్హం. ఎన్నికల బరిలో ఏం జరుగుతుందో వేచిచూడాల్సి ఉంది.

నరసాపురంలో అభ్యర్థుల సందడి

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్షలు

ఉదయం పరీక్షకు 62 శాతం, మధ్యాహ్నం పరీక్షకు 61 శాతం హాజరు

ప్రశ్నాపత్రాలు విజయవాడ తరలింపు

ప్రజాశక్తి - భీమవరం

తాడేపల్లిగూడెంలో బారులు తీరిన అభ్యర్థులు

జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షల నిర్వహణకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఏడు కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి. అభ్యర్థులు ఉదయం తొమ్మిది గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. గ్రేసు పీరియడ్‌తో కలిపి 9:45 గంటలకు, అలాగే మధ్యాహ్నం పరీక్షకు ఒంటి గంట నుండి 1:45 వరకు గ్రేసు పీరియడ్‌తో కలిపి అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. ఉదయం పేపరు-1 పరీక్షకు 4,209 మంది హాజరు కావాల్సి ఉండగా 2,618 మంది హాజరయ్యారు. సుమారు 1,591 మంది గైర్హాజరయ్యారు. 62.20 శాతం హాజరు నమోదైంది. అలాగే మధ్యాహ్నం పేపరు-2 పరీక్షకు 4,209 మంది హాజరు కావాల్సి ఉండగా 2596 మంది హాజరయ్యారు. సుమారు 1613 మంది గైర్హాజరయ్యారు. 61.68 శాతం హాజరు నమోదైంది. పరీక్షల అనంతరం ప్రశ్నాపత్రాలు, ఒఎంఆర్ షీట్లు, ఇతర పరీక్షా సామగ్రి పత్రాలను పూర్తి బందోబస్తుతో స్ట్రాంగురూమ్‌కు, తదుపరి ఎపిపిఎస్‌సి అధికారులు ప్రత్యేక భద్రతతో విజయవాడ తరలించారు. పరీక్షా కేంద్రంలోకి ఎలాంటి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, పుస్తకాలు అనుమతించలేదు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్ అమలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పరీక్షల నిర్వహణ అత్యంత ప్రశాంతంగా పూర్తి చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

నరసాపురం: ఎపిపిఎస్‌సి నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఆదివారం పట్టణంలోని శ్రీ వైఎన్ కళాశాలలో నిర్వహించారు. నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రం వద్దకు అభ్యర్థులు చేరుకున్నారు. తనిఖీల అనంతరం అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించారు. నరసాపురం డిఎస్‌పి జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఆర్‌డిఒ ఎం.ఎ.అంబరీష్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఉదయం పరీక్షకు 480 మందికిగాను 321 మంది హాజరయ్యారు. 159 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 480 మందికిగాను 320 మంది హాజరయ్యారు. 160 మంది గైర్హాజరయ్యారని అంబరీష్ తెలిపారు.

తాడేపల్లిగూడెం: గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. తాడేపల్లిగూడెంలోని శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు మొత్తంగా 52.5 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్, పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ రత్నాకర్‌రావు తెలిపారు. ఉదయం పరీక్షకు 739 మంది హాజరు కావాల్సి ఉండగా 662 మంది, సాయంత్రం పరీక్షకు 1401 మందికి 733 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. అదనపు సూపరింటెండెంట్లు గోపాలకృష్ణ, సుబ్రహ్మణ్యం నిర్వహణను పర్యవేక్షించారు.

సార్వత్రిక ఎన్నికలకు సంసిద్ధం

జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ అమలు

నిబంధనలు మీరితే కఠిన చర్యలు

మొత్తం ఓటర్లు 14,61,1337 మంది

298 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు

ఎన్నికల విధుల్లో వాలంటీర్లు ఉంటే చర్యలు తప్పవు

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం



జిల్లాలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామన్నారు. ఎన్నికల కమిషన్ సాధారణ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసిందని, ఈ నేపథ్యంలో జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ అమలులో ఉందన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలు మీరితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్, 25 వరకూ నామినేషన్ల స్వీకరణ, 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరుగుతుందన్నారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంటు స్థానంలో మొత్తం 14,61,337 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో పురుష ఓటర్లు 7,16,955 మంది, మహిళలు 7,44,308 మంది, థర్డ్ జెండర్ 74, సర్వీస్ ఓటర్లు 851 మంది ఉన్నారన్నారు. పట్టణ ప్రాంతాల్లో 374 పోలింగ్ కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో 1089 కలిపి మొత్తం 1463 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 298 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా, మరో మూడు అతి సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. సుమారు 301 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు వెబ్ కాస్టింగ్ సదుపాయాన్ని కల్పించామన్నారు. మూడు పోలింగ్ కేంద్రాలకు వెబ్ కాస్టింగ్‌తోపాటు వీడియో సర్వేలను కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, సిబ్బంది మొత్తం 9,681 మందిని నియమించినట్లు తెలిపారు. నియోజకవర్గానికి ముగ్గురు చొప్పున 28 స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీమ్స్, 19 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 38 వీడియో నిఘా బృందాలు, ఏడు వీడియో వీక్షణ బృందాలు, మరో ఏడు అకౌంటింగ్ వ్యయ బృందాలను నియమించామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా మూడు బెటాలియన్లను, వీటికి అదనంగా 1,500 మంది పోలీస్ సిబ్బందికి విధులను కేటాయించినట్లు వివరించారు. విష్ణు కళాశాలలో నరసాపురం, ఆచంట, పాలకొల్లు, తణుకు నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాలు, ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉండి, భీమవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కలెక్టరేట్లో ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఓటర్ హెల్ప్‌లైన్ నెంబర్ 08816299618, కాల్ సెంటర్ నెంబర్ 08816-299616, ఇఎస్ఎంఎస్, సువిధ, ఎన్‌కోర్ నిమిత్తం 08816 299617 అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలో 85 ఏళ్ల వయస్సు ఉన్నవారు, వికలాంగులు కలిపి 7,500 మంది ఓటర్లు ఉన్నారని, వీరందరికీ ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టామన్నారు. వీరి వివరాలు రాజకీయ పార్టీలకు తెలియకుండా చర్యలు తీసుకున్నామన్నారు. పోలింగ్ రోజున అధికారులు వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు.

వాలంటీర్లు ఎన్నికల విధుల్లో ఉంటే కఠిన చర్యలు

వాలంటీర్లకు ఎన్నికల విధులు అప్పగించొద్దని కోర్టు ఆదేశాలు ఉన్నాయని, ఎవరైనా వాలంటీర్లు ఎన్నికల విధుల్లో ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల విధులను వాలంటీర్లలకు అప్పగించడం లేదని, ఎక్కడైనా ఎన్నికల విధులకు పరోక్షంగా వలంటీర్లు సహకరిస్తున్నారనే విషయం తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లకు విధులు అప్పగించిన వారిపైనా చర్యలు తీసుకుంటామన్నారు.

నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు కోడ్ అమలులో ఉంటుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సభలు, సమావేశాలు, వాహనాలు అన్నింటికీ ముందస్తు అనుమతి పొందాలన్నారు.

మూడోసారి గెలిపించండి

మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

తనను మూడోసారి ఎంఎల్‌ఎగా గెలిపించాలని స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజు అన్నారు. ఆయన ఆదివారం కాళ్లకూరులోని వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజలు, రైతులు అందరూ సమిష్టిగా కృషి చేసి ఉండి నియోజకవర్గంలో తనను గెలిపించాలని కోరారు. 2009, 2014 ఎన్నికల్లో తనను ఎంఎల్‌ఎగా గెలిపించడంతో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతోపాటు పలు అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగానని, గతంలో వలె తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ ఛైర్మన్ అడ్డాల గణపతిరాజు, శివరామరాజు సోదరులు వేటుకూరి కృష్ణంరాజు, వేటుకూరి నారాయణరాజు, గాదిరాజు పెద్ద లచ్చిరాజు, నంబూరి త్రినాధమూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలి ఆత్మహత్య కేసులో ఉండివాసి అరెస్టు

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల ఆత్మహత్య చేసుకున్న తెనాలికి చెందిన మహిళ గీతాంజలి ఆత్మహత్య కేసులో ఉండి ఇసుకదొడ్డికి చెందిన యువకుడు పెనిమిజ్జి వెంకటదుర్గారావు సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం రాత్రి అరెస్టు చేసిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. దీనికి సంబంధించి వెంకట దుర్గారావు బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకట దుర్గారావు (వెంకన్న) తండ్రి అప్పారావు మరణించడంతో పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో గీతాంజలి మరణించిన తర్వాత మెసేజ్ చేయడంతో ఆమె మరణం కేసులో అనుమానాస్పద వ్యక్తి అనే ఆరోపణలతో సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్లారన్నారు. ఈ ఆత్మహత్యలో నిజనిర్ధారణ పారదర్శకంగా చేయాలని వారు కోరారు.

లోక్‌అదాలత్‌లో 1971 కేసుల పరిష్కారం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్

ప్రజాశక్తి - ఏలూరు

బాధితులకు పత్రం అందజేస్తున్న న్యాయమూర్తులు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఈ నెల 16న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా 1971 కేసులు పరిష్కరించినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ తెలిపారు. ఈ లోక్‌అదాలత్‌కు జిల్లాలో 32 బెంచ్‌లు ఏర్పాటు చేశామని, ఏలూరులో 8, భీమవరం 4, కొవ్వూరు 4, నరసాపురం 3, తణుకు 4, తాడేపల్లిగూడెం 4, పాలకొల్లు 1, నిడదవోలు 1, జంగారెడ్డిగూడెం 1, చింతలపూడి 1, భీమడోలు కోర్టులో ఒక బెంచ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా 1971 కేసులను రాజీ చేశారని, వాటిలో 1760 పెండింగ్ కేసులున్నాయని తెలిపారు. 1346 క్రిమినల్ కేసులు, 51 కుటుంబ వివాద కేసులు, 168 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 195 సివిల్ కేసులను రాజీ చేయగా 211 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించినట్లు వివరించారు. వీటిలో ఏలూరులో 614, భీమవరంలో 203, చింతలపూడిలో 87, జంగారెడ్డిగూడెంలో 121, కొవ్వూరులో 142, నర్సాపురంలో 59, పాలకొల్లులో 68, తాడేపల్లిగూడెంలో 155, తణుకులో 182, నిడదవోలులో 40, భీమడోలులో 84 కేసులు రాజీ చేసినట్లు పేర్కొన్నారు. వీటితోపాటు జిల్లావ్యాప్తంగా 2356 పెట్టి కేసులను కూడా రాజీ చేసినట్లు తెలిపారు. కేసుల పరిష్కారానికి సహకరించిన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. .

కోడ్‌ను కఠినంగా అమలు చేయాలి

కలెక్టర్ సుమిత్ కుమార్

భీమవరం: జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్ (ఎంసిసి)ను కఠినంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఇఆర్‌ఒలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ భవనాలపై ఉన్న రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు, కార్యాలయాల్లో ఉన్న ఫొటోలను, ఇతర క్యాలెండర్లను తొలగించాలని ఆదేశించారు. బస్టాండ్, రైల్వే స్టేషన్లలో, రోడ్డుకు ఇరువైపులా, మీటింగ్ ప్రాంతాల్లో అన్ని హోర్డింగులను తొలగించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లను ఆదేశించారు. ఆదివారం విజయవాడ రాష్ట్ర ఎన్నికల కార్యాలయం నుంచి ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత తీసుకున్న చర్యలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిచారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు, రిటర్నింగ్ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పేరుపాలెం బీచ్‌లో యాత్రికుల సందడి

కిటకిటలాడిన పేరుపాలెం బీచ్

ప్రజాశక్తి - మొగల్తూరు రూరల్

మండలంలోని పేరుపాలెం బీచ్ పర్యాటకులతో ఆదివారం కిటకిటలాడింది. పర్యాటకలో ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాల బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఇసుక తిన్నెలపై ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు

పోలవరం నుంచి సిపిఐ పోటీ

ప్రజాశక్తి - చింతలపూడి

అసెంబ్లీ ఎన్నికల్లో ఏలూరు జిల్లా పోలవరం నియోజవర్గం నుండి సిపిఐ అభ్యర్థి పోటీకి నిలబడుతున్నట్లు ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, జిల్లా ఇన్‌ఛార్జి అక్కినేని వనజ తెలిపారు. సిపిఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం చింతలపూడిలో బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సిపిఐ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న అక్కినేని వనజ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఏలూరు పార్లమెంట్‌తో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపు కోసం సిపిఐ నాయకులు, కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేయాలని ఆమె కోరారు. కార్యవర్గ సమావేశం పోలవరం నియోజకవర్గం నుంచి సిపిఐ అభ్యర్థిగా కారం దారయ్య పేరును ఏకగ్రీవంగా ఆమోదిస్తూ రాష్ట్ర పార్టీ పరిశీలనకు తీర్మానాన్ని పంపించనున్నట్లు సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మనవ కృష్ణ చైతన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు యు.హేమ శంకర్, ఎమ్‌డి మున్నీరు, సన్నేపల్లి సాయిబాబా, బత్తుల వెంకటేశ్వరరావు, బాడిస రాము, ఎం.వెంకటాచారి పాల్గొన్నారు.

మొగల్లులో కవాతు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోండి

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవడంలో ప్రజలకు పోలీసులు తోడుంటారని పాలకోడేరు ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు సూచించారు. ఓటర్లకు భరోసా కల్పిస్తూ మొగల్లులో ప్రత్యేక బలగాలతో ఆదివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా నిర్వహించడమే లక్ష్యంగా ఎస్పి అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు భీమవరం డిఎస్పి నారాయణస్వామిరెడ్డి పర్యవేక్షణలో భీమవరం సిఐ వై.సత్యకిషోర్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించామని తెలిపారు. అనంతరం కొండేపూడి, వేంద్ర గ్రామాల్లో కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, సివిల్ పోలీసులు, ఎఫ్ఎస్‌టి టీమ్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

నేడు ఆచంటలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆచంట

ఈ నెల 18వ తేదీ సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు స్థానిక కమ్మ సంఘం కళ్యాణ మండపంలో కిమ్స్, మెడ్ యునైటెడ్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైసిపి రాష్ట్ర యువజన కార్యదర్శి, జిల్లా ఉపాధ్యక్షులు వైట్ల కిషోర్‌కుమార్ తెలిపారు. ఈ శిబిరంలో కార్డియాలజీ, న్యూరాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, కంటి పరీక్షలు, గైనకాలజిస్ట్, దంత పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆచంట నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై చర్చ

ప్రజాశక్తి - భీమవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ఇసి సభ్యుల సమావేశం ఆదివారం భీమవరంలో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు కెఆర్.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జి.ఆస్కారరావు, రాష్ట్ర సలహామండలి సభ్యులు జి.సత్యనారాయణ, కమర్షియల్ ట్యాక్స్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగసాయి, రాష్ట్ర కార్యదర్శి బిహెచ్.రవీంద్రరాజు, రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్, ఆర్‌టిసి ఎంప్లాయీస్ నాయకులు కేదా ఈశ్వరరావు, కడప జిల్లా అధ్యక్షులు రమేష్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలు ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. జిల్లా, తాలూకా యూనిట్ల కార్యక్రమాలపై సమీక్షించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం గురించి, తాలూకా, జిల్లా ఇసి సభ్యులు లేవనెత్తిన అంశాలపై చర్చించారు. జిల్లా, తాలూకా స్థాయిల్లో అసోసియేషన్‌ను మరింత పటిష్టం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ జిల్లా సభ్యులకు దిశ నిర్దేశం చేశారు.

గోకరాజు రామరాజును కలిసిన పివిఎల్

ప్రజాశక్తి - కాళ్ల

సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థిగా పివిఎల్.నరసింహరాజుకు టిక్కెట్ ఖరారు కావడంతో ఆయన టిటిడి మాజీ సభ్యులు గోకరాజు రామరాజును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండి నియోజకవర్గంలో రాజకీయ ప్రముఖులను కలిసి తనను గెలిపించేందుకు సహకారం అందించాలని కోరారు. పివిఎల్‌తో పాటు కాళ్ల జెడ్‌పిటిసి సభ్యులు సోమేశ్వరరావు, వైసిపి నాయకులు మోటుపల్లి గంగాధరరావు, పెన్మెత్స విశ్వనాధరాజు, మంతెన సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

'జగన్ చేసిన మేలును చాటి చెప్పాలి'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సిఎం జగన్ చేసిన మేలును ప్రజలకు చాటి చెప్పాలని వైసిపి శ్రేణులకు ఎంఎల్ఎ అభ్యర్థి, డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ పిలుపునిచ్చారు. టిక్కెట్ ఖరారైన అనంతరం తొలిసారిగా ఆదివారం తాడేపల్లిగూడెంలోని పార్టీ కార్యాలయంలో విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి కొట్టుతో పాటు వైసిపి నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాల, రాష్ట్ర ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్ వడ్డి రఘురామ్‌నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ అసెంబ్లీ, లోక్ సభ స్థానాల్లో బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు 50 శాతం సీట్లు ఇచ్చి జగన్మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. వైసిపి ప్రభుత్వంలో జగనన్న సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాలకు జరిగిన మేలును ప్రజల్లోకి వెళ్లి చాటి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు తెన్నేటి జగ్జీవన్, ఎఎంసి ఛైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జెడ్‌పిటిసి సభ్యులు ముత్యాల ఆంజనేయులు, పార్టీ టౌన్ ప్రెసిడెంట్ గుండుబోగుల నాగు, వన్‌టౌన్, టూటౌన్ కన్వీనర్లు కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, టౌన్ మహిళా ప్రెసిడెంట్ బోనం విజయనిర్మల, యూత్ ప్రెసిడెంట్ చిటికెన ప్రసాద్, నియోజకవర్గ మహిళా కన్వీనర్ తాడిపర్తి రజిని పాల్గొన్నారు.

టిడ్కో గృహాల విషయంలో మాట తప్పిన జగన్

ఎంఎల్ఎ నిమ్మల సతీమణి సూర్యకుమారి

ప్రజాశక్తి - పాలకొల్లు

తాము అధికారంలోకొస్తే టిడ్కో గృహాలను ఉచితంగా ఇస్తానని పాలకొల్లు ఎన్నికల ప్రచార సభలో జగన్ ఇచ్చిన మాట తప్పి నిరుపేదలు, మహిళలను మోసగించాడని ఎంఎల్ఎ నిమ్మల సతీమణి సూర్యకుమారి అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆదివారం పాలకొల్లు 29, 30 వార్డుల్లో ఆమె టిడిపి, జనసేన శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఉమ్మడి అభ్యర్థి ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడును గెలిపించాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేసే రామానాయుడిని గెలిపించుకుంటేనే మేలు జరుగుతుందన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో ఎంఎల్ఎ రామానాయుడు 90 శాతం గృహాలను పూర్తి చేస్తే ఈ ఐదేళ్లలో మిగిలిన పది శాతం పనులకు అర బస్తా సిమెంట్, రూపాయి ఖర్చు పెట్టలేదన్నారు. గృహాలు లబ్ధిదారులకు అప్పగించకుండానే బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రూ.కోట్లు ప్రభుత్వ ఖాతాలో వేసుకుని లబ్ధిదారుల నెత్తిన రుణభారం పెట్టారని విమర్శించారు. మరో రెండు నెలల్లో అధికారంలోకి రానున్న టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వంలో గృహాలను ఉచితంగా అందిస్తారని సూర్యకుమారి తెలిపారు.

వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - గణపవరం

రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలు కావడంతో ఆదివారం పిప్పర సెంటర్‌లో నిడమర్రు సిఐ ఎంవి.సుభాష్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిఐ సుభాష్ మాట్లాడుతూ వాహనాల్లో ఎటువంటి రసీదులు, ఆధారాలు లేకుండా రూ.50 వేల నగదు, రూ.పది వేల విలువైన బహుమతులు తీసుకెళ్లకూడదని చెప్పారు. ఒకవేళ ఆధారాలు లేకుండా తీసుకెళ్తే వాహనాలను సీజ్ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గణపవరం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మరమ్మతులకు గురైన రేషన్ వ్యాన్

సరుకులు అందక ప్రజల ఇక్కట్లు
మూడు నెలలుగా ఇదే పరిస్థితి
పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

రేషన్ సరఫరా చేసే వాహనం

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని అయిభీమవరంలో వినియోగదారులకు రేషన్ బియ్యం సరఫరా చేసే వ్యాన్ మూడు నెలలుగా షెడ్డులో ఉంది. దీన్ని పట్టించుకునేవారే లేరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో ప్రారంభించిన రేషన్ వ్యాన్ మరమ్మతులకు గురవుతుంది. ఈ రేషన్ వ్యాన్ సాధారణ వ్యక్తుల కన్నా వృద్ధులు, వికలాంగులకు సౌలభ్యంగా ఉంటుంది. ఆ రెండు కోవలకు చెందినవారు రేషన్ షాపు వద్దకు వెళ్లి క్యూలో నిల్చుని బియ్యం సరుకులు తీసుకునే పరిస్థితి ఉండదు. వారికి ఇంటికి తీసుకొచ్చి ఇవ్వడం వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది. అయితే ఆ రకంగా ఉపయోగపడుతున్నప్పటికీ వ్యాన్లు మాత్రం నాణ్యతాలోపంతో ఎక్కడికక్కడ పడకేస్తున్నాయి. ఒక ఆయిభీమవరంలో వినియోగదారులకు రేషన్ సరుకులు సరఫరా చేసే వ్యాన్ సుమారు ఆరు నెలలుగా పడకేసింది. మొదటిగా వ్యాన్‌పై సరఫరా చేసే యువకుడిని ఫిర్యాదుల కారణంగా తప్పించారు. ఆ తర్వాత ఒక నెల రోజులు పాటు ఎవరిని నియమించలేదు. దీంతో రెండు నెలలు సరఫరా సమస్య ఏర్పడింది. ఆ తర్వాత దుంపగడపకు చెందిన ఒక యువకుడిని నియమించినా అతను ఒక నెలలోనే వెళ్లిపోయాడు. మళ్లీ రెండు నెలలు ఖాళీ ఏర్పడింది. ఎట్టకేలకు స్థానిక యువకుడిని రేషన్ సరఫరా కోసం నాలుగు నెలల క్రితం నియమించారు. అయితే నియమించిన ఒక్క నెల అతను వ్యాన్‌పై సరుకులు సరఫరా చేశాడు. ఆ కాలంలో కూడా వ్యాన్ వల్ల ఎంతో ఇబ్బంది పడినట్లు తెలిపాడు. ఆ తర్వాత నుంచి వ్యాన్ పనిచేయక సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతం మూడు నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. బియ్యం సరఫరా చేసేవారు లేకపోవడంతో వృద్ధులు, వికలాంగులు బియ్యం తీసుకునే వారి శాతం భారీగా తగ్గిపోయింది. వీటికి తోడు వ్యవసాయ పనులకు వెళ్లిన వార్లు తిరిగొచ్చి తీసుకునేందుకు సమయం లేక అనేకమంది బియ్యం వదులుకునే పరిస్థితి ఏర్పడుతోంది. ఆకివీడు మండలంలో ఈ పరిస్థితులను సమీక్షించేందుకు పౌరసరఫరాల విభాగానికి సంబంధించిన ప్రత్యేకాధికారులు ఎవరూ లేకపోవడం గమనార్హం. ఎక్కడో ఉన్న డిటి ఇన్‌ఛార్జులు మాత్రమే పని చేస్తున్నారు. అధికారుల వద్ద పూర్తిస్థాయి సమాచారం ఉండదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రేషన్ వ్యాన్‌కు మరమ్మతులు చేయించి, రేషన్ సరఫరా చేసే వ్యక్తిని నియమించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నరసాపురంలో 9 కేంద్రాలు ఏర్పాటు
ఎంఇఒ పుష్పరాజ్యం

ప్రజాశక్తి - నరసాపురం

ఎంఇఒ పుష్పరాజ్యం

పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి పి.పుష్పరాజ్యం తెలి పారు. మండలంలో రెండు, టౌన్‌లో ఏడు మొత్తం తొమ్మిది పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మండలం లోని రెండు పరీక్షా కేంద్రాల్లో 440 మంది, పట్టణంలోని ఏడు పరీక్షా కేంద్రంలో 1454 మంది పరీక్షలు రాస్తున్నారన్నారు. మొత్తం 1894 మంది పరీక్షలు రాస్తున్నారన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

నేటి నుండి ఒంటి పూట బడులు

ఈ నెల 18వ తేదీ నుంచి నుంచి ఒంటి పూట బడులు ప్రారంభమవుతాయని మండల విద్యాశాఖాధికారి పి.పుష్పరాజ్యం తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి 12.30 వరకు పాఠశాలలు జరుగుతాయన్నారు. పది పరీక్షలు జరిగిన పాఠశాలలో ఒంటి గంట నుంచి ఐదు గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు పుష్పరాజ్యం తెలిపారు.

ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం

తాడేపల్లిగూడెం : సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులందరికీ వారి హాల్ టిక్కెట్ ఆధారంగా పల్లె వెలుగు బస్సుల్లో నివాస ప్రాంతం నుంచి పరీక్ష కేంద్రాలకు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించినట్లు తాడేపల్లిగూడెం ఆర్‌టిసి డిపో మేనేజర్ సూర్యనారాయణమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏవిధమైన బస్‌పాస్ అవసరం లేదన్నారు. విద్యార్థులు సమయపాలన పాటించి బస్సు సౌకర్యం వినియోగించుకుని పరీక్షకు హాజరై విజయం సాధించాలని తెలిపారు.

వెంకటరమణమూర్తికి సాహితీ పురస్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రముఖ కవి కొప్పర్తి వెంకటరమణమూర్తికి, పాలకొల్లు రసధుని సాహితీ సంస్థ ప్రతిష్టాత్మకమైన పెద్దిబొట్ల బ్రహ్మయ్య స్మారక రసధుని సాహితీ పురస్కారం అందించింది. పాలకొల్లు లయన్స్ క్లబ్‌లో కొట్టి భాస్కరరావు అధ్యక్షతన ఆదివారం సభ నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, భూపతిరాజు విశ్వనాథరాజు, డాక్టర్ రెంటాల వెంకటేశ్వరరావు, సుంకర గోపాల్, డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ, పెనుమాక రామ్మోహన్, జె.జయదుర్గారావు హాజరయ్యారు. కోశాధికారి యర్రంశెట్టి వెంకటరత్నం రసధుని స్వాగత ఉపన్యాసంతో సభ ప్రారంభమైంది. అవార్డు గ్రహీత కొప్పర్తి పాలకొల్లు ఛాంబర్ కాలేజీలో తన ఉద్యోగ ప్రస్థానం, రసధుని సాహితీ సంస్థతో తన అనుబంధం గుర్తుచేసుకున్నారు. సాహిత్య రంగంలో తాను చేసిన సేవలను గుర్తించి ఈ సాహితీ పురస్కారం అందించడం అరుదైన గౌరవంగా భావిస్తున్నానన్నారు. చాలా సంతోషంగా ఉందని, తనలో చెలరేగిన అనేక భావ సంఘర్షణలకు అక్షరరూపం తన కవిత్వమని, దానిని ఆదరించిన పాఠకులకు, సాహితీ వేత్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రసధుని సభ్యులు వంగా నరసింహరావు, సివివి.సత్యనారాయణమూర్తి, మాడభూషి కృష్ణప్రసాద్, చేగొండి రంగారావు, మామిడిశెట్టి శ్రీనివాసరావు, ఎల్‌బికె.మూర్తిరాజు, కొలాటి పెద్దిరాజు, యు.పెద్దిరాజు, నాగలింగేశ్వరరావు, మండెల భాస్కరరావు, యర్రా అజయకుమార్, ఇనుకొండ శేషాద్రి, రాయి సూరిబాబు, చల్లా అన్నపూర్ణేశ్వరరావు, మేడికొండ రామదాసు, మండేల రజని, ఎన్.లక్ష్మీనారాయణ, సిద్ధిరెడ్డి వెంకటరత్నం, కనూరి జి.బాబు, కారుమూరి సూర్యనారాయణ, కొల్లి నరసింహమూర్తి పాల్గొన్నారు.


సాహితీ పురస్కారం అందుకుంటున్న వెంకటరమణమూర్తి

మోడీని గద్దె దింపడమే ఆదినారాయణకు నివాళి

వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - వీరవాసరం

కేంద్రంలో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే ఆదినారాయణకు ఇచ్చే ఘనమైన నివాళి అని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ అన్నారు. కందుల ఆదినారాయణ 12వ వర్ధంతి సభ గ్రామ కార్యదర్శి అయినంపుడి బాబూరావు అధ్యక్షతన ఆదివారం నవుడూరులో నిర్వహించారు. ఆదినారాయణ చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన హరేరామ్ మాట్లాడుతూ ఆదినారాయణ బ్రతికుంటే వీరవాసరం మండలమే కాకుండా జిల్లా అంతా బిజెపి కుంభకోణాలను బయటపెట్టి బండారం ప్రజలకు వివరించేవారన్నారు. బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పడం కోసం ఎందుకు ప్రయత్నిస్తుందో ఎలక్ట్రోరల్ బాండ్ల ద్వారా బయటపడిందన్నారు. మోడీని గద్దె దింపడమే కందుల ఆదినారాయణకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. రాష్ట్రంలో బిజెపికి వత్తాసు పలుకుతున్న అధికార, ప్రతిపక్ష, పార్టీలు కూడా ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. లింగం సత్యనారాయణ మాట్లాడుతూ లౌకికదేశంలో సిఎఎ తీసుకొచ్చి ప్రజలు కొట్టుకుచచ్చేలా ప్రవర్తిస్తున్నాయన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ ఆదినారాయణ ఆశయాలను సాధించడం కోసం కార్యకర్తలందరూ అహర్నిశలు శ్రమించాలని కోరారు. తొలుత హరేరామ్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి హరిహర రాము, యాళ్ల బండి నారాయణమూర్తి, జుత్తిగ సాంబియమ్మ, యాళ్ల బండి నాగవేణి, ఆచంట కనకచలం, సానుభూతిపరులు పాల్గొన్నారు.


కందుల ఆదినారాయణకు నివాళులర్పిస్తున్న రైతు సంఘం నేతలు

గణపవరంలో ఫ్లెక్సీలు తొలగించేయిస్తున్న అధికారులు

పాలకొల్లులో ఫ్లెక్సీలు తొలగించిన అనంతరం

ఎన్నికల కోడ్ అమలు.. ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగింపు

ప్రజాశక్తి - ఉండి

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో ఉండిలో అధికారులు ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించే పనిలో నిమఘ్నమయ్యారు. ఉండిలో రెండు రోజుల క్రితం ఎంఎల్ఎ మంతెన రామరాజు గోడ స్టిక్కర్లు వేయించడంతో వాటిని అధికారులు సిమెంటుతో తొలగించే పనిలో ఉన్నారు. ఎలక్షన్ కోడ్ రావడంతో మండలంలో రాజకీయ ప్రతినిధులకు చెందిన ఎటువంటి ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయరాదని అధికారులు తెలిపారు. ఎవరైనా ఎలక్షన్ కమిషనర్ ఆదేశాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాలకొల్లు : ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన 24 గంటల్లో బ్యానర్లు, ఫ్లెక్సీలు తీసివేయాలనే ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పాలకొల్లు పట్టణంలో శనివారం రాత్రి మున్సిపల్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఫ్లెక్సీలు తొలగించారు.

గణపవరం : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలు కావడంతో ఆదివారం గణపవరంలో పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, పార్టీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, బ్యానర్లు తొలగించారు.

చిలకలూరిపేటకు తరలిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - ఉండి

చిలకలూరిపేటలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజాగళం బహిరంగ సభకు ఆదివారం టిడిపి ఉండి మండలాధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కరిమెరక నాగరాజు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న వైసిపిని తరిమికొట్టేందుకు టిడిపి, జనసేన, బిజెపి కలిశాయన్నారు. ఈ కూటమి సుమారు 150 అసెంబ్లీ స్థానాల్లో విజయబావుటా ఎగురవేయటం ఖాయమన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఏర్పడ్డ ఈ కూటమికి ప్రజలందరూ మద్దతు తెలపాలని ఆయన కోరారు. చిలకలూరిపేట వెళ్లిన వారిలో పార్టీ ఉండి గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి, నాయకులు కరిమెరక శ్రీనివాసరావు, ముదునూరి భాస్కరరాజు, నాగరాజు సందక, గోనబోయిన రామకృష్ణ పాల్గొన్నారు.

మొగల్తూరు రూరల్ : పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో టిడిపి, జనసేన, బిజెపి ఏర్పాటు చేసిన జనగళం సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి టిడిపి శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సభకు ప్రధాని నరేంద్రమోడీ, టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ హాజరయ్యారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కాళీపట్నం చేరుకుని ప్రత్యేక వాహనాల్లో సభకు తరలివెళ్లారు. నాయకులు గుబ్బల నాగరాజు, కత్తిమండ ముత్యాలరావు, పాల గోపాలం, రాంబాబు, జోగి పండు, నాగిడి రాంబాబు, కొల్లాటి భోగరాజు, డొల్ల రత్నంరాజు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి - నరసాపురం

జనసేన పార్టీ సిద్ధాంతాలు నచ్చి నరసాపురం మండలం కొత్త నవరసపురం గ్రామానికి చెందిన పలువురు నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ సమక్షంలో వైసిపి నుంచి జనసేనలో చేరారు. వారందరికీ నాయకర్ జనసేన కండువా కప్పి పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు.

మొగల్తూరు రూరల్ : జనసేన పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షతులూ ప్రజలు పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నారని ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన అంద్రాజు లక్ష్మణస్వామి, అంద్రాజు శ్రీను, కొల్లాటి నాగేశ్వరరావు, తిరుమాని రామస్వామి అనుచరులు దాదాపుగా 30 మంది వనమాలి శ్రీను ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారందరికీ నాయకర్ పార్టీ కండువా కప్పి సాదారంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జక్కం బాబ్జి, అందే దొరబాబు పాల్గొన్నారు.

వైసిపిలోకి చేరిక

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని లక్ష్మణేశ్వరం ముస్కేపాలెం గ్రామంలో కొప్పాడ శ్రీనివాస్ (దుబాయ్ శ్రీను) ఆధ్వర్యంలో సుమారు 50 మంది జనసేన నుంచి వైసిపిలోకి చేరారు. వారికి ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాలకృష్ణ

ప్రజాశక్తి - పాలకోడేరు


పొన్నమండ బాలకృష్ణ

వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పొన్నమండ బాలకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పని చేసి 175 నియోజకవర్గాల్లో వైసిపి అభ్యర్థులు విజయదుందుభి మోగించేలా కృషి చేస్తానన్నారు. పార్టీ ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తనను ఈ పదవిలో నియమించిన సిఎం జగన్, ఉభయగోదావరి జిల్లాల కో-ఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రీజనల్ కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు, మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిపల్లి మంగరాజులకు కృతజ్ఞతలు తెలిపారు.

'మోడీ హయాంలో పెరిగిపోయిన నిరుద్యోగం'

ప్రజాశక్తి - నరసాపురం

మోడీ హయాంలో నిరుద్యోగం పెరిగిపోయిందని కాంగ్రెస్ నాయకుడు మోకా శ్రీనివాస్ అన్నారు. నరసాపురంలో ఆయన సమక్షంలో పెద్దఎత్తున మహిళలు ఆదివారం కాంగ్రెస్‌లోకి చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. దేశంలోని నిరుద్యోగులకు, రైతులకు రుణాలు ఇవ్వని ప్రభుత్వాలు పెద్ద పెద్ద వ్యాపారులకు భారీ ఎత్తున్న ఎగ్గొట్టే వాళ్లకు రుణాలు ఇచ్చారన్నారు. మోడీ హయాంలో రాష్ట్రానికి ఒరగిందేమీ లేదన్నారు. చదువు పూర్తయిన నిరుద్యోగులు రోడ్డున పడ్డారన్నారు. బెంగళూరు, మద్రాసు, హైదరాబాద్ ప్రాంతాలకు వలస వెళ్తున్నారన్నారు. కేంద్రంలో రాహుల్ గాంధీ, రాష్ట్రంలో షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో తాను కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరాడి వరలక్ష్మి, పి.లక్ష్మి, కె.నాగేశ్వరరావు, పి.ధనలక్ష్మి, బి.పాపాయమ్మ, ఎస్.బుజ్జమ్మ పాల్గొన్నారు.

'పేదలకు అండగా జగన్'

ప్రజాశక్తి - ఉండి

అగ్రవర్ణ పేదలకు న్యాయం చేస్తూ ఇబిసి నేస్తం పథకంతో ప్రోత్సహిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని ఎన్ఆర్‌పి అగ్రహారం ఎంపిటిసి సభ్యులు మున్నలూరి సువర్ణలక్ష్మిశ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుపేద ఆర్యవైశ్యులను ప్రసన్నం చేసుకునేందుకు వైశ్య కార్పొరేషన్ ఏర్పాటుచేసి నిధులు సమకూర్చకుండా వైశ్యులను మోసం చేసిందన్నారు. సిఎం జగన్ చిరు వ్యాపారం చేసుకునే ఆర్యవైశ్యులు వ్యాపారాలు చేసుకునేందుకు ఇబిసి నేస్తం పేరిట సంవత్సరానికి రూ.15 వేలు ఉచితంగా అందించి వారి వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నారన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి - మొగల్తూరు రూరల్

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం యాత్రికులతో ఆదివారం కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణరాజు, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షించారు. ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ప్రసాదం వితరణ, తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

అన్నదాన కార్యక్రమంలో ప్రజలు

కొత్తపేటలో అఖండ అన్నసమారాధన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు లాకు దిగువ కొత్తపేటలో ఉన్న శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. సుమారు నాలుగు వేల మందికి మంది పైగా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తొలుత మహిళలతో కోలాటం నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులు వట్టం గణేష్, మానెం బసవరాజు, బాసిన గున్నేశ్వరరావు, బాసిన సత్యనారాయణ, వట్టం భాస్కరరావు, బాసిన రాజు, బాసిన మోహన్, ఆనెం భాస్కరరావు, కార్యవర్గ సభ్యుల పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు.